ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

జయశంకర్ భూపాలపల్లి

ములుగు

గురువారం 22 ఆగస్టు 2024





హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో..



భూపాలపల్లి జిల్లా ఆస్పత్రిలో..



ములుగు జిల్లా ఆస్పత్రిలో..



మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రిలో..



ఎంజీఎం ఆస్పత్రిలోని జ్వరాల వార్డులో చికిత్స పొందుతున్న చిన్నారులు



జనగామ జిల్లా ఆస్పత్రిలో..

ఆంధ్రజ్యోతి ఫోకస్

జ్వర పంజా

ఉమ్మడి జిల్లాలో సీజనల్ వ్యాధుల విజృంభణ

- డెంగీ, మలేరియా, తదితర జ్వరాలతో మంచం పడుతున్న జనం
- వైద్యం కోసం ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులకు క్యూ

జ్వరాలు పంజా విసురుతున్నాయి. అసలే వర్షాకాలం.. మరోవైపు పారిశుధ్య నిర్వహణ లోపంతో అపరిశుభ్రంగా మారుతున్న పరిసరాలు, దోమల వ్యాప్తి ఇందుకు కారణమవుతోంది. సీజనల్ వ్యాధుల నియంత్రణకు యంత్రాంగం చర్యలు చేపడుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం జటిలంగా మారుతోంది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో డెంగీ, మలేరియా, టైఫాయిడ్ లాంటి జ్వరాలు వ్యాప్తి చెందుతుండటం జనాలను కలవర పెడుతోంది. ఓ వైపు ప్రతీ ఇంట్లో ఒకరిద్దరు జ్వరబాధితులు ఉంటుండగా.. మరోవైపు చికిత్స కోసం వస్తున్న బాధితులతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. హనుమకొండ ఎంజీఎం, వరంగల్, మహబూబాబాద్, ములుగు, భూపాలపల్లి, జనగామ జిల్లా ఆసుపత్రులతో పాటు పీహెచ్‌సీల్లోని వార్డులు నిండిపోతున్నాయి. ఉమ్మడి జిల్లాకు ఎంతో కీలకమైన ఎంజీఎం ఆస్పత్రిలో పిల్లల వార్డుతోపాటు జనరల్ మెడిసిన్ విభాగంలో మంచానికి ఇద్దరు చొప్పున రోగులు చికిత్స పొందుతుండగా మిగిలిన వార్డులు కూడా కిటకిటలాడుతున్నాయి. ఈ క్రమంలోనే మరణాలు కూడా సంభవిస్తుండటంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. ఇక ఈ జటిల పరిస్థితిని తమకు అనుకూలంగా మార్చుకుంటున్న ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వాహకులు దందాకు తెరలేపుతున్నారు. చికిత్సలు, నిర్ధారణ పరీక్షల పేరుతో ఎక్కువ మొత్తంలో గుంజుతున్నారని, ప్లేట్‌లెట్స్ ఎక్కించేందుకు ఆస్పత్రి స్థాయిని బట్టి రూ.11వేల నుంచి రూ.15వేల వరకు చార్జ్ చేస్తున్నట్టు తెలుస్తోంది.

వివరాలు : 7లో..

బావమరిదిపై బావ కత్తితో దాడి

నుదురు, చేతి మణికట్టుపై గాయాలు



దాడిలో గాయపడ్డ సాయికిరణ్

కాటారం, ఆగస్టు 21: తన భార్యను కాపురానికి రానివ్వడం లేదనే ఆగ్రహంతో బావమరిదిపై బావ కత్తితో దాడిచేసిన సంఘటన భూపాలపల్లి జిల్లా కాటారం మండలం గుండ్రాత్‌పల్లిలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. కాటారం ఎస్సై అభినవ్, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గుండ్రాత్‌పల్లి గ్రామానికి చెందిన నగునూరి శంకర్, పద్మ దంపతులకు కుమారుడు సాయికిరణ్, కూతురు సాయిప్రియ ఉన్నారు. సాయిప్రియను ఆరేళ్ల క్రితం మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలంలోని బావ్‌రావుపేట గ్రామానికి చెందిన కమ్మగోని ప్రణయ్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. మొదట్లో భార్యతో సఖ్యంగానే ఉన్న ప్రణయ్ కొన్ని నెలల తర్వాత ఆమెపై అనుమానం పెంచుకున్నాడు. ఆపై వరకట్నం కోసం వేధించేవాడు. ఈ విషయంలో పలుమార్లు పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీలు జరిగాయి. ఈ క్రమంలో భార్యను బాగానే చూసుకుంటానని చెప్పి తీసుకెళ్లిన ప్రణయ్ మళ్లీ ఆమెతో ఘర్షణకు దిగేవాడు. పది రోజుల క్రితం గొడవ పడగా ఆమె గుండ్రాత్‌పల్లిలోని పుట్టింటికి వచ్చింది. తన భార్యను కాపురానికి పంపాలని ప్రణయ్ కోరగా అత్తింటి వారు ససేమిరా అన్నారు. ఈ విషయంలో సాయిప్రియ సోదరుడు సాయి కిరణ్ జోక్యం చేసుకోగా అతడిపై కోపం పెంచుకున్నాడు. చెల్లికి సపోర్ట్ చేస్తూ కాపురానికి రాకుండా అడ్డుపడుతున్నాడనే ఆగ్రహంతో రగిలిపోయిన ప్రణయ్ అతడిని అడ్డుతొలగించుకోవాలని ప్లాన్ వేశాడు. మంగళవారం రాత్రి గుండ్రాత్‌పల్లిలో ఇంట్లో ఉన్న బావమరిది సాయికిరణ్‌పై ప్రణయ్ హఠాత్తుగా వచ్చి వెంట తెచ్చుకున్న కత్తితో దాడి చేశాడు. సాయి కిరణ్ ప్రతిఘటిస్తూ తలను పక్కకు తప్పించి చేతిని అడ్డుపెట్టుకోవడంతో కత్తి నుదురు, ఎడమ చేతి మణి కట్టుకు గుచ్చుకుని తీవ్ర గాయాలయ్యాయి. దీంతో సంఘటన స్థలం నుంచి ప్రణయ్ పారిపోయాడు. సాయికిరణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం ప్రణయ్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్సై అభినవ్ తెలిపారు. నిందితుడు ప్రణయ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

మంత్రిని కలిసిన భూ నిర్వాసితులు



సమస్యను మంత్రికి వివరిస్తున్న నిర్వాసితులు

మల్హర్, ఆగస్టు 21 : జెన్‌కో భూ ఉపరితల బొగ్గు గనుల తవ్వకాల్లో భూనిర్వాసితులు మంత్రి శ్రీధర్‌బాబును హైదరాబాద్‌లో బుధవారం కలిశారు. పెద్ద తాడిచర్ల డేంజర్ జోన్ నివాస గృహాలను సేకరణకు త్వరగా చర్యలు ప్రారంభించాలని కోరారు. ఓసీపీ వల్ల నిత్యం ఇబ్బందులకు గురవుతున్నామని వివరించారు. దీనిపై మంత్రి స్పందిస్తూ విద్యుత్, ఆర్థిక శాఖల మంత్రులతోపాటు జెన్‌కో అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి ఈ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. గృహాలకు కావాల్సిన బడ్జెట్ మంజూరు చేయిస్తానని చెప్పారు. మంత్రిని కలిసిన వారిలో భూ నిర్వాసితుల సంఘం అధ్యక్షుడు దండు రమేష్, కేసారపు చంద్రయ్య, ధన్నపునేని అశోక్‌రావు, ధన్నపునేని సురేష్‌రావు, బొబ్బిలి రాజు, ఆర్ని ఉదయ్ తదితరులు ఉన్నారు.

వృద్ధులను ఆదరించాలి

జిల్లా సివిల్ కోర్టు జడ్జి జయరాంరెడ్డి



మాట్లాడుతున్న జిల్లా సివిల్ కోర్టు జడ్జి జయరాంరెడ్డి

కృష్ణకాలనీ (భూపాలపల్లి), ఆగస్టు 21: వృద్ధాప్యంలో ఉన్న వారిని ఆదరించడం మనందరి సంప్రదాయమని జిల్లా సీనియర్ సివిల్ కోర్టు జడ్జి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.జయరాంరెడ్డి అన్నారు. ప్రపంచ సీనియర్ సిటిజన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక అమృత వర్షిణి స్వచ్ఛంద సంస్థ, వృద్ధాశ్రమంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో ఉన్న వారితో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఓదార్పునిచ్చి వారికి మనోధైర్యాన్ని కల్పించారు. వద్ధాప్యంలో ఉన్న వారిని ఎవరూ ఇబ్బందులకు గురి చేయొద్దన్నారు.

ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ప్రియాంక, స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిష్కరించాలి

అధికారులతో కలెక్టర్ దివాకర



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

ములుగు, ఆగస్టు 21: భూముల క్రమబద్ధీకరణకు సంబంధించి దాఖలైన ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ టి.ఎస్.దివాకర ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశపుహాల్‌లో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన కోసం బుధవారం ఏర్పాటు చేసిన బృందాలతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించాలన్నారు. ముందుగా అన్ని దరఖాస్తుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అన్నారు. సర్వే నంబర్లు, ప్లాట్ అప్లికేషన్ల సంఖ్య, రోడ్డు విస్తీర్ణం, ఇనాంభూమి వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని, దరఖాస్తులకు డాక్యుమెంట్లు, ప్లాట్ ఇమేజెస్, మాస్టర్‌ప్లాన్ జతచేసి ఉండాలని అన్నారు. ఆస్థలం ప్రభుత్వానిదా.. శిఖంబూమి, ఎఫ్టీఎల్ పరిధిలో ఉన్నదా? అని పరిశీలించాలని సూచించారు. బృందాలు క్షేత్రస్థాయిలో గ్రామాల వారీగా, సర్వేనంబర్ల ప్రకారం వెళ్తే పని సులభం అవుతుందన్నారు. బృందంలోని సభ్యులందరూ లాగిన్ అయ్యేవిధంగా చూడాలన్నారు. కేటాయించిన మండలానికి సంబంధించిన అప్లికేషన్లను మాత్రమే పరిశీలించాలని సూచించారు. పరిశీలనకు వెళ్లే బృందాలు ముందుగా షెడ్యూల్ తయారు చేసుకోవాలన్నారు. ఎవరైనా డాక్యుమెంట్లు జత చేయనట్లయితే వారిని అడిగి జత చేయవచ్చని తెలిపారు. 26-08-2020 కంటే ముందు రిజిస్ట్రేషన్ చేసుకుని ఎల్‌ఆర్‌ఎస్ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న డాక్యుమెంట్ల దరఖాస్తుల స్క్రూటినీ ప్రక్రియ జరుగుతోందన్నారు. 4,980 ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో పరిశీలనకు 19బృందాలను ముగ్గురి చొప్పున నియమించామని తెలిపారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా దరఖాస్తులు అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఈసమావేశంలో అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, మహేందర్‌జీ, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, డీపీవో సంపత్‌రావు, జిల్లా ఇరిగేషన్ అధికారి అప్పలనాయుడు, ములుగు తహసీల్దార్ విజయభాస్కర్, ఇరిగేషన్ ఏఈలు, ఆర్‌ఐలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రుణమాఫీపై బీజేపీ నిరసన

రైతులతో కలిసి సీఎం దిష్టిబొమ్మ దహనం

అదుపులోకి తీసుకున్న పోలీసులు

మంగపేట, ఆగస్టు 21: రైతు రుణమాఫీపై బీజేపీ నాయకులు నిరసన తెలిపారు. ఆంక్షలు లేకుండా దీన్ని వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ మండల పరిధి గంపోనిగూడెంలోని బూర్గంపహాడ్-ఏటూరునాగారం ప్రధాన రహదారిపై బుధవారం రాస్తారోకో చేశారు. అనంతరం రైతువేదిక వద్ద ధర్నా చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. దీంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. అనంతరం తహసీల్దార్ వీరస్వామి ఎదుట హాజరుపర్చగా వ్యక్తిగత పూచీకత్తుపై విడిచిపెట్టారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా కార్యదర్శి లింగంపల్లి శ్రీనివాసరావు, మండల అధ్యక్షుడు పల్నాటి సతీష్ మాట్లాడుతూ ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులందరికీ రూ. 2 లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసగిస్తే సహించేది లేదన్నారు. రైతులకు అండగా ఉండి పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి కటుకోజు ప్రశాంత్, జిల్లా నాయకుడు పగిడిపల్లి చంద్రం, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి ఇందారాపు ప్రతాప్, మండల కార్యదర్శి బొల్లికొండ సాంబయ్య, బీజేవైఎం మండల అధ్యక్ష, కార్యదర్శులు రాజేష్, చల్లా రాంకీ. బీజేపీ అనుబంధ సంఘాల నాయకుడు పొదెం సుధాకర్, ఎంబటి నవీన్, శివ తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ నాయకులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

సింగరేణిలో కారుణ్య నియామకాలు

పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే సత్యనారాయణ



కారుణ్య నియామక పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే గండ్ర

కాకతీయఖని, ఆగస్టు 21: సింగరేణి సంస్థలో కారుణ్య నియామకం జరిగాయి. వీటి ద్వారా ఉద్యోగంలో చేరనున్న 14మందికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు బుధవారం నియామక పత్రాలు అందజేశారు. వీరితో పాటు డిస్మిస్ అయిన నలుగురు కార్మికులకు రీఅపాయింట్‌మెంట్ ఆర్డర్ కాపీలను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సింగరేణి కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో పాటుపడుతోందన్నారు. కార్మికులకు ఎలాంటి సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఏరియాలో డిస్మిస్ అయిన మిగిలిన కార్మికులకు తిరిగి ఉద్యోగం ఇప్పించేందుకు సంబంధిత ఉన్నతాధికారులతో మాట్లాడుతానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా జీఎం హబీబ్ హుస్సేన్, అధికారులు వెంకట్రామిరెడ్డి, మారుతి, కార్మిక సంఘాల నాయకులు బుచ్చయ్య, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

మేడారంలో ఘనంగా పొట్ట పండుగ

- వనదేవతల గుడిలో ప్రత్యేక పూజలు
- గద్దెల వద్ద జాగారం చేసిన పూజారులు

మేడారం, ఆగస్టు 21: తాడ్వాయి మండలం మేడారంలో వనదేవతలు సమ్మక్క, సారలమ్మల పూజారులు పొట్ట పండుగ బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకను మాఘకార్తెలో జరుపుకోవడం ఆనవాయితీ. ఈ సందర్భంగా ఆదివాసీలు, గ్రామస్థులతో కలిసి పూజారులు ప్రత్యేక పూజలు చేశారు. పూజారుల కుటుంబాలు వేకువజామున నిద్రలేచి ఇల్లు, వాకిలి శుభ్రం చేసుకున్నారు. జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించారు. మేడారం గ్రామంలోని సమ్మక్క గుడి, ఊరట్టం గ్రామ పంచాయతీ పరిధి కన్నెపల్లి గ్రామంలోని సారలవ గుడిని శుద్ధి చేశారు. భక్తి శ్రద్ధలు, నియమ నిష్ఠలతో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీపధూప నైవేద్యాలను సమర్పించారు. రోజంతా వనదేవతలను స్మరిస్తూ మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి రూపంలో ఉన్న పసుపు కుంకుమలు, పూజా సామగ్రిని రాత్రి 11 గంటల సమయంలో సిద్ధబోయిన మునీందర్ ఇంటి నుంచి కొక్కెర కృష్ణయ్య బుర్ర కొమ్ముల శబ్దాలు, డోలు వాయిద్యాల నడుమ దేవతల పూనకాలతో గ్రామంలోని సమ్మక్క మందిరానికి చేరుకున్నారు. అనంతరం గుడిలో గంటపాటు అంతర్గత పూజలు నిర్వహించారు. దేవతల మందిరం నుంచి అమ్మవార్ల జేజేలు పలుకుతూ గద్దెలకు చేరుకున్నారు. ఈ క్రమంలో పూజారుల ఆడబిడ్డలు, మహిళలు, భక్తులు అమ్మవార్లకు ఎదురుగా నీరు అరగించారు. అనంతరం పూజారులు తమ వెంట తీసు కొచ్చిన వరి, గోధుమ పొట్టలను తల్లులకు నైవేద్యంగా సమర్పించారు. రాత్రంతా గద్దెల ప్రాంగణంలో జాగారం చేశారు. ఉదయం సూర్యో దయానికి ఇళ్లకు చేరుకుంటారు. ఇదేవిధంగా కన్నెపల్లిలోని సారలమ్మ పూజారులు కాక సారయ్య, కాక కిరణ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.



సమ్మక్క గుడిలో పూజలు చేస్తున్న పూజారులు

నేడు ఆర్‌వోఆర్ యాక్ట్‌పై చర్చ

భూపాలపల్లి కలెక్టరేట్, ఆగస్టు 21: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ముసాయిదా ఆర్‌వోఆర్ యాక్ట్ 2024 అమలుపై కలెక్టరేట్‌లో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు చర్చ వేదిక నిర్వహించనున్నారు. ఈమేరకు కలెక్టర్ రాహుల్ శర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, న్యాయవాదులు, విద్యావేత్తలు, రైతులు, రైతు సంఘాలు, మేధావులు, విశ్రాంత రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు, అవగాహన ఉన్న ఇతర వ్యక్తులతో చర్చ వేదిక నిర్వహించనున్నట్లు వివరించారు. ఆర్‌వోఆర్ యాక్ట్ ముసాయిదాపై ఆయా వర్గాల నుంచి తగిన సూచనలు, సలహాలు తీసుకోనున్నట్లు తెలిపారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి

విలువిద్యలో అంతర్జాతీయ గుర్తింపు

గ్రామీణ విద్యార్థుల ప్రతిభను వెలికితీస్తున్న ఆర్డీఎఫ్

త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి

కల్లెడ కళాశాలలో సిబ్బంది క్వార్టర్లు ప్రారంభం



విల్లు ఎక్కుపెట్టిన ఇంద్రసేనారెడ్డి

వివరాలు 7వ పేజీలో..

విలువిద్యలో అంతర్జాతీయ గుర్తింపు

● గ్రామీణ విద్యార్థుల ప్రతిభను వెలికితీస్తున్న ఆర్డీఎఫ్ ● త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి



పర్వతగిరి, ఆగస్టు 21: ఆర్చరీ అకాడమీ ఏర్పాటు చేసి విలువిద్యలో విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసి ఎన్నో జాతీయ, అంతర్జాతీయ స్థాయి పతకాలు సాధించిన ఘనత రూరల్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ (ఆర్డీఎఫ్)దేనని త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కల్లెడలో ఆర్డీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వనితా అచ్యుతాపాయ్ జూనియర్ కళాశాలలో అధ్యాపకులకు నిర్మించిన క్వార్టర్లు, ఒకేషనల్ కోర్సులు, ల్యాబ్‌లను నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డితో కలిసి బుధవారం ప్రారంభించారు. తొలుత పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఆర్డీఎఫ్ ఆర్చరీ అకాడమీలో విలు విద్యకారులతో మాట్లాడి విల్లు ఎక్కుపెట్టారు. పొలంలో పురుగుల మందును పిచికారీ చేసే డ్రోన్ పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గవర్నర్ మాట్లాడుతూ 26ఏళ్ల క్రితం ఆర్డీఎఫ్‌ను స్థాపించి విద్యాలయాలను ఏర్పాటు చేయడమే గాకుండా, వివిధ ప్రాంతాలకు బ్రాంచ్‌లను విస్తరించడం ఆనందంగా ఉందన్నారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా గ్రామీణ విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యనందిస్తున్న ఆర్డీఎఫ్ సేవలు అభినందనీయమన్నారు. గ్రామంలో గతంలోనే కమ్యూనిటీ టాయిలెట్లను నిర్మించారని, కాలేజీ స్టాఫ్ కోసం డబుల్‌బెడ్రూం క్వార్టర్లు నిర్మించడంపై రామ్మోహన్‌రావుకు విద్యపై ఉన్న ఆసక్తిని తెలియజేస్తుందన్నారు. సంస్థకు విరాళాలు అందించే దాతలకు సైతం సంస్థలో విద్యనభ్యసించే విద్యార్థుల ఫలితాలు కూడా ఉత్తేజపరుస్తున్నాయన్నారు. బాలికల విద్యను పెంపొందించాలనే ఉద్దేశంతో పాఠశాల, కళాశాలలో బాలికలకు 50శాతం సీట్లు కేటాయిస్తూ, తల్లిదండ్రులు లేని విద్యార్థులకు ఉచిత విద్య, వసతి కల్పిస్తున్నారని అన్నారు.

నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ.. ఎన్నో ఒడిదుడుకులు వచ్చినా అంకితభావంతో పనిచేస్తున్న ఆర్డీఎఫ్ ఫౌండర్ మెంబర్ ఎర్రబెల్లి రామ్మోహన్‌రావును అభినందించారు. ఆయన తండ్రి వెంకట్రామనర్సయ్య సైతం గతంలో సేవాభావంతో ఎన్నో పనులను చేశారని, జిల్లా పరిషత్ తొలి చైర్మన్‌గా, సొసైటీ అధ్యక్షుడిగా సేవలందించారని గుర్తు చేశారు. ఆర్డీఎఫ్ ఫౌండర్ మెంబర్ ఎర్రబెల్లి రామ్మోహన్‌రావు మాట్లాడుతూ దాతల సహకారంతోనే పేద విద్యార్థులకు విద్యను అందించగలుగుతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఆర్డీఎఫ్ సెక్రటరీ కిరణ్ అడ్డాల, అనంతపాయ్, ప్రిన్సిపాల్ ఆడెపు జనార్దన్, పాఠశాల హెచ్‌ఎంలు అశోకాచారి, విష్ణు, నాయకులు విజయ్‌చందర్‌రెడ్డి, రావు పద్మ, కొండేటి శ్రీధర్, బొంపెల్లి దేవేందర్‌రావు పాల్గొన్నారు.

గవర్నర్‌ను కలిసిన బీజేపీ నేతలు

మండలంలోని కల్లెడ గ్రామంలో ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డిని బుధవారం పలువురు బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్, వరంగల్ అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, ఎస్సీ సెల్ రాష్ట్ర సభ్యుడు కొండేటి శ్రీధర్, జిల్లా నాయకుడు పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు పట్టాపురం ఏకాంతంగౌడ్, బొట్ల మధు, సంతోష్ పాల్గొన్నారు.



ల్యాబ్‌లో పరికరాలను పరిశీలిస్తున్న ఇంద్రసేనారెడ్డి



వరంగల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రి వద్ద కిటకిటలాడుతున్న రోగులు

వరంగల్ జిల్లాలో 27 డెంగీ కేసులు


మలేరియా ప్రబలుతున్నా లెక్కల్లో లేని వైనం

పోచమ్మమైదాన్, ఆగస్టు 21: వరంగల్ జిల్లా వాసులను జ్వరాల తీవ్రత కలవరానికి గురిచేస్తోంది. జలుబు, దగ్గు, వైరల్ ఫీవర్లతో బాధపడుతున్న వారు ఇంటికొకరు ఉంటున్నారు. డెంగీ, మలేరియా లాంటి కేసులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. దాంతో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. డెంగి లక్షణాలతో అనేక మంది ఆస్పత్రుల్లో చేరుతున్నారు. 20రోజుల వ్యవధిలోనే వరంగల్ జిల్లాలో 27 డెంగీ కేసులు నమోదైనట్లు వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు. గ్రామాలు, పట్టణాలు తేడా లేకుండా జ్వర పీడితులు రోజురోజుకు పెరుగుతున్నారు. వివిధ రకాల వైద్యపరీక్షల కోసం వచ్చినవారితో ల్యాబ్‌లు, డయగ్నాస్టిక్ సెంటర్లు, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు, మెడికల్ షాపులు రోగులతో నిండిపోతున్నాయి. నగరంతోపాటు శివారు ప్రాంతాలలోనూ డెంగీ కేసులు పెరుగుతున్నాయని వైద్యాధికారులు పేర్కొంటున్నారు. చిన్నారుల సైతం జ్వరంతో బాధపడుతుండగా పలు ప్రైవేటు ఆస్పత్రుల్లో వ్యాధుల వివరాలను యాజమాన్యాలు బయటకు రానివ్వడం లేదని, దీంతో నమోదైయ్యే కేసుల వివరాలు ప్రభుత్వ అధికారుల లెక్కలోకి రావడం లేదని తెలుస్తోంది. 2022లో 161, 2023లో 160 డెంగీ కేసులు నమోదవగా ఈ ఏడాది ఎనిమిది నెలల్లో జిల్లాలో మొత్తం 82డెంగీ పాజిటివ్ కేసులు నమోదైనట్టు వైద్యాధికారులు చెబుతున్నారు.

అలాగే అనేక మంది మలేరియా, చికున్‌గున్యాతో బాధపడుతున్నప్పటికీ వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు మాత్రం మలేరియా, చికున్‌గున్యా కేసులు నమోదవడం లేదని చెబుతుండటం గమనార్హం. ఈ ఏడాది ఇప్పటి వరకు ఏప్రిల్‌లో 3, జూలైలో 3, ఆగస్టులో 2 మలేరియా కేసులు మొత్తం 8 కేసులు మాత్రమే మలేరియా కేసులు నమోదయ్యాయని చెబుతున్నారు. కానీ బయట పరిస్థితి చూస్తే అనేకమంది మలేరియా, చికున్‌గున్యాతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. 2022లో 45, 2023లో 7 మలేరియా కేసులు నమోదవగా, ఈ ఏడాది ఆగస్టు 20 వరకు ఎనిమిది కేసులు నమోదయ్యాయి.

'జ్వర' పంజా

- డెంగీ, మలేరియా, తదితర జ్వరాలతో మంచం పడుతున్న జనం
- ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులకు క్యూ



ఉమ్మడి జిల్లాలో సీజనల్ వ్యాధుల విజృంభణ

ఉమ్మడి వరంగల్ జిల్లాపై జ్వరాలు పంజా విసురుతున్నాయి. వర్షాలు విస్తారంగా పడుతుండటంతో పాటు వాతావరణ మార్పులతో డెంగీ, మలేరియా, టైఫాయిడ్ లాంటి జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయి. పల్లెలు, పట్టణాలు తేడా లేకుండా ప్రతీ ఇంట్లో జ్వరబాధితులు మంచాలు పడుతున్నారు. ఈ క్రమంలో చికిత్స కోసం ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో అయితే మరణాలు కూడా సంభవిస్తుండటంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. ప్రస్తుతం ఉమ్మడి వరంగల్ జిల్లాలో జ్వరాలు ప్రబలుతున్న తీరుపై 'ఆంధ్రజ్యోతి' ఫోకస్

డెంగీ డేంజర్ బెల్స్

భూపాలపల్లి జిల్లాలో 23 కేసులు

భూపాలపల్లి కలెక్టరేట్, ఆగస్టు 21: భూపాలపల్లి జిల్లాలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. మలేరియా, డెంగీ పాజిటివ్ కేసులు అధికంగా నమోదవుతున్నాయి. ముఖ్యంగా డెంగీ డేంజర్ బెల్స్ మోగిస్తోంది. గత రెండు రోజుల్లో మూడు పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. జనవరి నుంచి ఇప్పటి వరకు 23 మంది ఈ మహమ్మారి బారిన పడ్డారు. అలాగే ఐదు మలేరియా కేసులు నమోదయ్యాయి. ఇవి అధికారిక లెక్కలు మాత్రమే. వైద్యాధికారుల దృష్టికి రాని కేసులో జిల్లాలో అధికంగానే ఉన్నాయని తెలుస్తోంది. విషజ్వరాలు విజృంభిస్తుండటంతో ప్రజలు ఆస్పత్రుల బాట పడుతున్నారు. పల్లెల్లో పారిశుధ్యం లోపించడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. విషజ్వరాలు వ్యాపిస్తున్న గ్రామాల్లో అధికారులు నామమాత్రంగా వైద్య శిబిరాలు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు వస్తున్నాయి. ప్రతీ ఏడాది జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో దోమల వల్ల ప్రజలు రోగాల బారినపడకుండా దోమతెరలను పంపిణీ చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు అదెక్కడా కానరావడం లేదు.

ఏటా పెరుగుతున్న విషజ్వరాలు

జిల్లాలో విషజ్వరాలు ఏటా పెరుగుతున్నట్టు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. గతేడాది 83కుపైగా డెంగీ కేసులు నమోదయ్యాయి. 2022లో ఏడు, 2021లో 11, 2022లో 42, 2023లో 85 నమోదయ్యాయి. ఈ 8నెలల్లోనే 23 కేసులు నమోదవగా మరో నాలుగు నెలల్లో ఇంకా పెరిగే అవకాశాలున్నట్టు తెలుస్తోంది. మరోవైపు మలేరియా కేసులు కూడా జిల్లాలో అక్కడక్కడ నమోదవుతున్నాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు ఐదుగురు దీని బారిన పడ్డారు. చికున్‌గున్యా కేసులు మాత్రం నాలుగేళ్లలో కానరాలేదు. 2020 నుంచి నేటివరకు నమోదవలేదని వైద్యవర్గాలు పేర్కొంటున్నాయి. గత 24 గంటల్లో మూడు పాజిటివ్ కేసులు నమోదవగా భూపాలపల్లి, రేగొండ, కాటారం పీహెచ్‌సీల పరిధిల్లో ఒకొక్కరు చొప్పున జ్వరాల బారిన పడ్డారు. ఇక జిల్లాలో నమోదైన 23 కేసుల్లో అత్యధికంగా భూపాలపల్లి పరిధిలోవే ఉన్నాయి.

ఆస్పత్రులకు క్యూకడుతున్న ప్రజలు

జ్వరాలతో ప్రజలు ఆస్పత్రుల బాటపడుతున్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి (జీజీహెచ్) రోగుల తాకిడి విపరీతంగా ఉంది. రోజూ 650మంది ఓపీ పరీక్షలు చేయించుకుంటున్నారని, వీరిలో 500కుపైగా మంది జ్వరాలతో బాధపడే వారే ఉన్నారని తెలుస్తోంది. దీంతో ఈ ఆస్పత్రిలో ప్రత్యేకంగా ఆరు పడకల మెడికల్ ఐసీయూను ఏర్పాటు చేశారు. టీ-హబ్‌లో రోజూ జిల్లాలోని 13 పీహెచ్‌సీలు, రెండు సీహెచ్‌సీల నుంచి వచ్చిన 80-100 శ్యాంపిళ్ల పరీక్షలు నిర్వహిస్తున్నారు. మంగళవారం వచ్చిన 80శాంపిల్స్‌లో మూడు పాజిటివ్‌గా నిర్ధారణైంది.



భూపాలపల్లిలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కిటకిటలాడుతున్న వార్డులు

మంచానికి ఇద్దరు..

జ్వరబాధితులతో ఎంజీఎం కిటకిట

హనుమకొండ జిల్లాలో రోజురోజుకూ పెరుగుతున్న బాధితులు

పీహెచ్‌సీలకు క్యూ కడుతున్న జనం



ఎంజీఎం ఓపీలో బారులు తీరిన రోగులు

వరంగల్ మెడికల్, ఆగస్టు 20: ఉమ్మడి జిల్లాలో జ్వరాలు పంజా విసురుతున్నాయి. డెంగీ, మలేరియా, ఇతర వైరల్ ఫీవర్లతో జనం సతమతమవుతున్నారు. ప్రస్తుతం ప్రతీ ఇంట్లో ఒక్కరైనా జ్వరపీడితులు కనిపిస్తున్నారు. ఏ ప్రైవేటు ఆస్పత్రి చూసినా రోగులతో కిటకిటలాడుతోంది. ఇక ప్రభుత్వ ఆస్పత్రుల్లో అయితే మంచానికి ఇద్దరు చొప్పున చికిత్స పొందుతున్నారు. ఆరోగ్యశాఖ అప్రమత్తంగా ఉన్నా అంతకంటే వేగంగా వైరస్ విస్తరించడం పట్ల వైద్యులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఎంజీఎం ఆస్పత్రిలో పిల్లల వార్డుతోపాటు జనరల్ మెడిసిన్ విభాగంలో మంచానికి ఇద్దరు చొప్పున చికిత్స పొందుతున్నారు. వార్డులన్నీ కిటకిటలాడుతున్నాయి. మరోవైపు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కూడా జ్వర బాధితులు క్యూ కడుతున్నారు.

వైద్య పరీక్షలు కీలకం

డెంగీ వ్యాధి నిర్ధారణలో వైద్య పరీక్షలు కీలకంగా మారా యి. ఐజీఎం పరీక్షలతోనే కచ్చితత్వం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ఆర్‌డీటీ ప్లేట్‌లెట్ కౌంట్, సీరం టెస్ట్ విధా నంలో పరీక్షలు నిర్వహించడం సరికాదని సీనియర్ వైద్యు లు చెబుతున్నారు. ర్యాపిడ్ డయాగ్నోస్టిక్ పరీక్షలు 100 శాతం నమ్మశక్యం కాదని అంటున్నారు. యాంటిజెన్ పాజి టివ్ ఉంటేనే 100శాతం వ్యాధి ఉన్నట్లు నిర్ధారించుకోవాల్సి ఉంటుందని చెబుతున్నారు.



ఎంజీఎంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ఎంజీఎంలో డెంగీ, మలేరియా కేసులు

సంవత్సరం	మలేరియా	డెంగీ	చికున్‌గున్యా
2020	194	73	0
2021	310	128	0
2022	229	615	0
2023	93	821	0
2024	23	234	0

దండుకుంటున్న ప్రైవేటు ఆస్పత్రులు

హనుమకొండ, వరంగల్ నగరాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులన్నీ వైరల్ ఫీవర్ బాధితులతో కిటకిటలాడుతున్నాయి. కొన్ని ప్రైవేట్ ఆస్పత్రులు.. పరిస్థితులను ఆసరా చేసుకుని దండుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. దీంతో జ్వరానికి చికిత్సకు రూ.50వేల నుంచి లక్షకు పైగానే ఖర్చు చేయాల్సిన దుస్థితి ఎదురవుతోంది. ములుగురోడ్డులోని ఓ కార్పొరేట్ ప్రైవేట్ ఆస్పత్రి తమ ఐదు అంతస్థులను ఫీవర్ వార్డులుగా మార్చి సొమ్ము చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. అదే విధంగా బాలసముద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి జ్వరం వచ్చారంటే చాలు.. అడ్మిట్ అయితేనే చికిత్స అంటూ రోగులను భయభ్రాంతులకు గురిచేస్తూ కరోనా కాలం కంటే ఎక్కువ సొమ్మును కాజేస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

అధిక ధరలకు 'ప్లేట్‌లెట్స్'

ప్లేట్‌లెట్స్ పడిపోయినప్పుడు అందించే సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్‌లను ఈ సీజన్ అదనుగా చూసుకొని అధిక ధరలకు ఇస్తున్నట్టు రోగులు వాపోతున్నారు. ఆస్పత్రి స్థాయిని బట్టి ఈ ప్లేట్‌లెట్లను రూ.11వేల నుంచి రూ.15వేల వరకు విక్రయిస్తున్నారని, పేదల ఆస్పత్రి అయిన ఎంజీఎంలో ఈ యంత్రం లేకపోవడంవల్ల ప్రైవేట్ వైపు మొగ్గు చూపాల్సి వస్తోందని ఆవేదన చెందుతుఉన్నారు.

ముందు జాగ్రత్తలు

డెంగీ జ్వరం వస్తే తీవ్రత తగ్గించేందుకు చల్లని నీటితో మెత్తని వస్త్రం లేదంటే స్పాంజీని ముంచి శరీరాన్ని తుడవాలి. తక్షణశక్తినిచ్చే పౌడర్లు, పండ్ల రసాలు తాగించాలి. దీనివల్ల జ్వర తీవ్రత తగ్గి ప్లేట్‌లెట్స్ అదుపులోకి వస్తాయి. ప్రతి ఒక్కరూ ఫ్రైడేను డ్రైడేగా పాటించి పరిసరాల పరిశుభ్రత పాటించాల్సి ఉంటుంది. డెంగీని గుర్తిస్తే 20 శాతం వరకు ఎలాంటి ప్రమాదం లేకుండా చికిత్స పొందవచ్చునని వైద్యులు చెబుతున్నారు.

ప్లేట్స్‌లెట్స్ తగ్గితే సొంత వైద్యం వద్దు..

డాక్టర్ దుర్గం వెంకటేశ్, ఫిజీషియన్, ఎంజీఎం



ప్లేట్‌లెట్ సంఖ్య తగ్గితే సొంత వైద్యం చేయిం చుకోవద్దు. వైద్యుల పర్యవేక్షణలోనే చికిత్స పొం దాలి. వైరల్ జ్వరం వచ్చిన వారు హెపటైటీస్ పరీక్ష చేయించుకోవడం ఉత్తమం. చాలా మంది డెంగీ బాధితులకు బొప్పాయి పండు తినడం వల్ల కడుపునొప్పి, వాంతులు లాంటివి ఉంటాయి. తీవ్రమైన జ్వరం, శరీరంపై దద్దుర్లు, తలనొప్పి, వాంతులు లాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.



మహబూబాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఓపీ కోసం బారులు తీరిన రోగులు, బంధువులు

మానుకోట జిల్లాలో మరింత విజృంభణ

● ఇప్పటికే ఇద్దరు మృతి ● 250 డెంగీ, 12 మలేరియా కేసులు నమోదు

మహబూబాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణాలు, గ్రామాలు, తండాలు.. ఇలా మహబూబాబాద్ జిల్లాలో జ్వరాలు మరింత విజృంభిస్తున్నాయి. ప్రతీ ఇంట్లో ఒకరిద్దరు చొప్పున జ్వరబాధితులు మంచం పట్టారు. దీంతో జనం జ్వర భయంతో బిక్కుబిక్కుమంటున్నారు. ఇప్పటికే జిల్లాలో జ్వరాలతో ఇద్దరు మృతి చెందడంతో ప్రజలు మరింత ఆందోళన చెందుతున్నారు. డెంగీ, మలేరియా, జ్వరాలు వ్యాప్తి పెరగడంతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులన్నీ రోగులతో కిటకిటలాడుతున్నాయి. జిల్లాలోని కేసముద్రం మండలం బేరువాడకు చెందిన ఒకరు, తొర్రూరు మండల కేంద్రానికి చెందిన నాలుగేళ్ల చిన్నారి మృతి చెందారు. జిల్లాలో సాధారణం కంటే ఎక్కువగా కేసులు నమోదవుతున్నాయి. ఇప్పటికే జిల్లాలో 250 డెంగీ, 12మలేరియా కేసులు, 48,664 మంది ఇతర జ్వరాలతో బాధపడుతున్నట్టు వైద్యాధికారులు గుర్తించారు. జిల్లా జనరల్ ఆస్పత్రిలో రోజూ 1600 నుంచి సుమారు 2 వేల మంది వరకు ఓపీ పేషెంట్లు వస్తుండగా, అందులో సగానికి పైగా జ్వర లక్షణాలున్నవారేనని వైద్యులు చెబుతున్నారు. జిల్లాలోని కొత్తగూడ, అయోధ్యపురం, తీగలవేణి, ముల్కనూరు, కురవి, డోర్నకల్ మల్యాల, మహబూబాబాద్ అర్బన్, కేసముద్రం, నెల్లికుదురు, మరిపెడ ప్రాంతాల్లో అధికంగా డెంగీ, మలేరియా జ్వరాలు విజృంభిస్తున్నాయి. దీంతో ఆయా ప్రాంతాల పరిధిలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

మానుకోట జిల్లాలోని 21 పీహెచ్‌సీల్లో కేసులు నమోదయ్యాయిలా..

సంవత్సరం	డెంగీ	మలేరియా	ఇతర వ్యాధి
2022	125	20	--
2023	40	06	--
2024	250	12	48,664



మహబూబాబాద్ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఓపీ వద్ద భారీగా ఉన్న రోగులు

నామమాత్రంగా వైద్య శిబిరాలు

విస్తారంగా వర్షాలు కురవడం, వాతావరణ మార్పులతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. ఈ క్రమంలో గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాల్సిన వైద్యాధికారులు.. నామ్‌కేవాస్తేగా పల్లెల్లో వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నారన్న విమర్శలున్నాయి. ఇప్పటికైనా గ్రామాల్లో పూర్తిస్థాయిలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి, ప్రజలను అప్రమత్తం చేయాల్సిన అవసరం ఉంది. దీనికి తోడు గ్రామపంచాయతీ పాలక మండలి పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిసారించి వ్యాధుల నియంత్రణకు కృషి చేయాల్సిన అవసరం ఉంది.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి..

గుండాల మురళీధర్, ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వో, మహబూబాబాద్



సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ తదితర జ్వరాల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఇతర ఆరోగ్య సూత్రాలు పాటించాలి. ఏ మాత్రం అలసట అనిపించినా వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలి.

దోమలమందు పిచికారీ చేయాలి

బానోత్ విష్ణు, సీరోలు, మహబూబాబాద్ జిల్లా



వరుసగా కురుస్తున్న వర్షాలతో గ్రామాల్లోని మురుగుకాల్వలు, కుంటల్లో నీరు నిలిచిపోయింది. దీంతో ఆయా ప్రాంతాల్లో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. అధికారులు గ్రామాల్లో దోమల నివారణ మందును పిచికారీ చేయాలి. దీంతో పాటు గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రతీ ఒక్కరికి వైద్య పరీక్షలు నిర్వహించాలి.

వణుకుతున్న ఏజెన్సీ గ్రామాలు

● ప్రబలుతున్న జ్వరాలతో గిరిబిడ్డల బెంబేలు ● కొనసాగుతున్న ఫీవర్ సర్వే

ములుగు, ఆగస్టు 21: ఏజెన్సీ పల్లెల్లో జ్వరాలు విజృంభిస్తున్నాయి. వానాకాలం ప్రారంభమైన తర్వాత ఊళ్లకుఊళ్లు మంచం పడుతున్నాయి. ఏ ఇల్లు చూసినా ఒకరిద్దరు జ్వర పీడితులు కనిపిస్తున్నారు. వ్యాధుల నివారణ కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నప్పటికీ పారిశుధ్య నిర్వహణలో లోపం, కలుషితతాగునీరు, వాతావరణ మార్పులతో సీజనల్ వ్యాధులకు అడ్డుకట్ట పడడంలేదు. ఈ క్రమంలోఆస్పత్రులు జ్వరబాధితులతో నిండుతున్నాయి. ములుగు ఏరియా వైద్యశాల, ఏటూరునాగారం, వెంకటాపురం(నూగూరు) సామాజిక వైద్యశాలలతోపాటు 15 ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలకు నిత్యం వందలాది మంది జ్వరపీడితులు వస్తున్నారు. ఏరియా ఆస్పత్రి, సామాజిక వైద్యశాలల్లో బెడ్లన్నీ నిండిపోతుండగా పీహెచ్‌సీలలో అందుబాటులో ఉన్న బెడ్లపై చికిత్స అందిస్తున్నారు.

రెండునెలల్లో 67 డెంగీ, మలేరియా కేసులు

వైద్య ఆరోగ్యశాఖ ప్రతిఏటా ఇంటింటా ఫీవర్ సర్వేలు నిర్వహిస్తోంది. సమస్యాత్మక గ్రామాలను ముందే గుర్తించి క్లోరినేషన్, దోమల నివారణ మందును పిచికారీ చేయిస్తోంది. ములుగు జిల్లాలో ఈసారి 123 సమస్యాత్మక గ్రామాలను గుర్తించి ముందస్తు వ్యాధుల నివారణ చర్యలు చేపట్టారు. అయినప్పటికీ పరిస్థితి అదుపులోకి రాలేదు. జూన్, జూలై, ఆగస్టు 20 వరకు నిర్వహించిన జ్వర సర్వేలో 60,136 మందికి జ్వరం సోకినట్లు తేలింది. వీరందరి రక్త నమూనాలు సేకరించి పరీక్షించగా 34 మందికి మలేరియా, 33 మందికి డెంగీ నిర్ధారణ అయింది. అత్యధికంగా ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రికి వచ్చిన రోగుల్లో 21 మందికి డెంగీ, 13 మందికి మలేరియా నిర్ధారణ అయింది.

ఆందోళన కలిగిస్తున్న మరణాలు

జ్వరంతో బాధపడుతున్న పలువురు ప్రాణాలు కోల్పోవడం ఆందోళన కలిగిస్తోంది. అయితే... ఈ మరణాలను వైద్య ఆరోగ్యశాఖ నమోదు చేయలేదు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ మృతిచెందినట్లు పేర్కొంటున్నారు. ములుగు మండలం జాకారంలో ఇటీవల ఓ నిండు గర్భిణి, వాజేడు మండలానికి చెందిన మరో గర్భిణి జ్వరంతో బాధపడుతూ మరణించారు. వాజేడు మండలానికి చెందిన మరో మహిళ కూడా డెంగీ లక్షణాలతో మృతిచెందింది. మంగపేట మండలంలో మూడునెలల కాలంలో తొమ్మిది మంది జ్వరంతో మరణించినట్టు తెలుస్తోంది.



కన్నాయిగూడెం పీహెచ్‌సీకి వచ్చిన బాలింత



మంగపేట పీహెచ్‌సీకి వచ్చిన జ్వరపీడితులు



ములుగు ఏరియా ఆస్పత్రిలో మందులు తీసుకుంటున్న దృశ్యం

పీహెచ్‌సీలకు ప్రత్యేక నిధులు

జ్వరాలు విజృంభిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో పీహెచ్‌సీలకు కలెక్టర్ ప్రత్యేక నిధులను కేటాయించారు. మంత్రి సీతక్క ఆదేశాలతో ఒక్కో పీహెచ్‌సీకి రూ.50వేల చొప్పున మంజూరు చేశారు. వీటితో అవసరమైన మలేరియా, డెంగీ టెస్టింగ్ కిట్లను సమకూర్చుకోవాల్సి ఉంటుంది. అదేవిధంగా ములుగులోని ఏరియా ఆస్పత్రిని తనిఖీ చేసి వైద్యులతో సమీక్ష జరిపిన కలెక్టర్ మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. టీ-డయాగ్నోహబ్‌లో లోపాలను గుర్తించి సాంకేతిక సమస్యలను పరిష్కరించి వ్యాధి నిర్ధారణ పరీక్షలను పునరుద్ధరించేందుకు ప్రత్యేక నిధులు కేటాయించేలా చర్యలు చేపడుతున్నారు.

జనగామలో హైఫీవర్

జిల్లాలో పెరుగుతున్న 53 డెంగీ కేసులు

జనగామ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : జనగామ జిల్లాను హైఫీవర్ వెంటాడుతోంది. సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ లాంటి విషజ్వరాలతో ప్రజలు ఆసుపత్రుల పాలవుతున్నారు. జ్వరాలతో వచ్చే బాధితులతో జిల్లాకేంద్రంలోని ప్రధాన ఆసుపత్రితో పాటు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. పట్టణం, పల్లె అనే తేడా లేకుండా పారిశుధ్య నిర్వహణ లోపం కారణంగా జిల్లాలో దోమలు, ఈగలు బెడద తీవ్రంగా ఉండటంతో డెంగీ, మలేరియా, టైఫాయిడ్, చికున్‌గున్యా జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయి. ఇటీవల 'స్వచ్ఛదనం-పచ్చదనం' పేరుతో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టినా అవి తూతూమంత్రంగానే సాగాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో సీజనల్ కేసులు పెద్దసంఖ్యలో నమోదవుతున్నా అవన్నీ లెక్కలోకి రావడం లేదు. అయితే జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రితో పాటు పీహెచ్‌సీల్లో నిర్ధారణైన కేసులు మాత్రమే అధికారికంగా నమోదవుతున్నాయి. జిల్లాలోని 12 గ్రామాల పరిధిలో ఒక జిల్లా ఆసుపత్రి, 4 సీహెచ్‌సీలు, 13 పీహెచ్‌సీలు ఉన్నాయి. వీటితో పాటు గ్రామాల్లో ఆర్‌ఎంపీలు, జిల్లాకేంద్రంతో పాటు స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి లాంటి నియోజకవర్గ కేంద్రాల్లో పదుల సంఖ్యలో ఉన్న ప్రైవేటు ఆసుపత్రుల్లోనూ రోగులు చికిత్స తీసుకుంటున్నారు. ప్రైవేటుగా చికిత్స తీసుకుంటున్న వారి వివరాలు రికార్డ్ కావడం లేదు. దీంతో జిల్లాలో ప్రభుత్వ లెక్కల కంటే రెట్టింపు కేసులు నమోదవుతున్నట్లు తెలుస్తోంది. జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 53 డెంగీ, 6 మలేరియా కేసులు నమోదయ్యాయని, మరో 2వేలకుపైగా సాధారణ జ్వరాలు నమోదైనట్టు అధికారులు చెబుతున్నారు.



జనగామ జిల్లా ఆస్పత్రిలో ఓపీ కోసం వచ్చిన రోగులు

రూ.వేలల్లో ఆసుపత్రి బిల్లులు

ప్రస్తుత పరిస్థితులు ప్రైవేటు ఆసుపత్రులకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. జ్వరాలతో అడ్మిట్ అయిన రోగుల నుంచి వైద్యం, నిర్ధారణ పరీక్షలు, స్కానింగుల పేరుతో రూ.వేలకు వేలు బిల్లులు వేస్తున్నారు. చిన్నపాటి జ్వరానికే హడావిడి చేస్తున్నారని, డెంగీ, మలేరియా, టైఫాయిడ్ లాంటి జ్వరాలైతే ఇక వారి ఇష్టారాజ్యమన్నట్టుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. ఈ క్రమంలో ఓపీకి వచ్చిన పేషెంట్లకు టెస్టులు, మందులతో కలిపి రూ.5వేలకు పైనే అవుతుండగా అడ్మిట్ వారికైతే రూ.30వేలు, ప్లేట్స్‌లెట్స్ తగ్గడంలాంటి సమస్య వస్తే రూ.50వేలపైనే అవుతున్నాయి. అధికారుల నిఘా లేకపోవడంతో ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు, డాక్టర్లు 'తాము ఆడిందే ఆట' అన్నట్టుగా వసూలు చేస్తున్నారన్న అభిప్రాయాలున్నాయి.

ఐదేళ్లుగా జిల్లాలో నమోదైన కేసులు

వ్యాధి	2020	2021	2022	2023	2024
డెంగీ	6	15	34	45	53
మలేరియా	6	7	7	8	4
చికున్‌గున్యా	0	0	0	0	0
మొత్తం	12	22	41	53	57

కేటీకే-6వ గనిని సందర్శించిన డీడీఎంఎస్

కాకతీయఖని, ఆగస్టు 21: సింగరేణి భూపాలపల్లి ఏరియాలోని కేటీకే-6వ గనిని డీడీఎంఎస్ (ఎలక్ట్రికల్) ఎస్.కె.నాగుల్‌మీరా బుధవారం తనిఖీ చేశారు. అండర్ గ్రౌండ్, సర్ఫేజ్ పని ప్రదేశాలను, సబ్ స్టేషన్లు, ఎలక్ట్రికల్ పరికరాలను పరిశీలించారు. ప్రమాదాలు జరగకుండా తీసుకుంటున్న జాగ్రత్తపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సింగరేణి జీఎం హబీబ్ హుస్సేన్, అధికారులు వెంకటరమణ, జీఎల్ ప్రసాద్, సారంగపాణి తదితరులు ఉన్నారు.

ఓసీ-3లో కమలేష్

సింగరేణి భూపాలపల్లి ఏరియాలోని ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్-3ని డీడీఎంఎస్ (మైనింగ్) కమలేష్ కుమార్ వర్మ సందర్శించారు. ఈ సందర్భంగా హలర్‌రోడ్స్, పంపింగ్, లైటింగ్, డంపర్ల పనితీరును పరిశీలించారు. భద్రతాపరమైన అంశాలను గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట అధికారులు భిక్షమయ్య, జీఎల్ ప్రసాద్, భానుప్రసాద్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఇంటర్మీడియట్ విద్యాధికారి తనిఖీ

మహదేవపూర్, ఆగస్టు 21: ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి భూక్యా వెంకన్న బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాల నిర్వహణ, సంబంధిత రికార్డులు పరిశీలించారు. సాధారణ తరగతులు, ఎంసెట్ క్లాసుల నిర్వహణ, కళాశాలకు హాజరుకాని విద్యార్థులకు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అధ్యాపకులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నాలి నర్సయ్య, వైస్ ప్రిన్సిపాల్ చంద్ర, పలక ప్రసాద్, అధ్యాపకులు రమేష్, సమ్మయ్య, సదాశివ్, సదానందం, సంధ్య, శ్వేత, రమాదేవి, నాగలక్ష్మి, శైలజ, పోచయ్య, పిన్నయ్య, నాన్ టీచింగ్ స్టాఫ్ లక్ష్మయ్య, రాజయ్య ఉన్నారు.

ఎయిడ్స్ బాధితులపై వివక్ష తగదు



మారథాన్ రెడ్ రన్‌ను ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో

ములుగు రూరల్ ఆగస్టు 21: ఎయిడ్స్ బాధితుల పట్ల వివక్ష చూపించొద్దని డీఎంహెచ్‌వో డాక్టర్ అల్లెం అప్పయ్య అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం జరిగిన యూత్ ఫెస్ట్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మారథాన్ రెడ్ రన్ కార్యాక్ర మాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో అప్పయ్య మాట్లాడుతూ హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. హెచ్‌ఐవీ బారిన పడిన వారికి ఏఆర్‌టీ జిల్లాలో మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మల్లేష్, వైస్ ప్రిన్సిపాల్ మహ్మద్ రఫీఖ్, ఎయిడ్స్ లెప్రసీ జిల్లా నియంత్రణ అధికారి డాక్టర్ భవ్య పాల్గొన్నారు.

నేడు వాహనాల వేలం

కాటారం, ఆగస్టు 21: మండల కేంద్రంలోని కాటారం ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం ఆవరణలో వివిధ కేసుల సందర్భంగా పట్టుబడ్డ వాహనాలను గురువారం ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం వేస్తున్నట్లు ఎక్సైజ్ ఎస్సై కిష్టయ్య ఓ ప్రకటనలో తెలిపారు. ఎక్సైజ్ సూపరిండెంట్ ఆధ్వర్యంలో జరిగే బహిరంగ వేలంలో పాల్గొనాలనుకున్న వారు ముందుగానే వాహనాలను చూసుకుని అప్‌సెట్ ధరను చెల్లించాలని పేర్కొన్నారు.

హత్యాచార నిందితులను ఉరితీయాలి : సీపీఐ

కాకతీయఖని, ఆగస్టు 21: కోల్‌కతా జరిగిన మెడికో హత్యాచార నిందితులను ఉరి తీయాలని సీపీఐ భూపాలపల్లి పట్టణ కార్యదర్శి ప్రవీణ్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మహిళలపై అత్యాచారాలు, హత్యలు పెరుగుతున్నాయని విమర్శించారు. మణిపూర్‌లో జరిగిన ఘటన కూడా ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్తలకు ఆర్థికసాయం

కన్నాయిగూడెం, ఆగస్టు 21: మండలంలోని గుర్రేవుల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త లేగల సారయ్య కూతురు పెళ్లికి పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనరసింహారావు ఆర్థికసాయం అందించారు. తన తరపున రూ. 30 వేలు, పార్టీ మండల కమిటీ తరపున రూ. 10 ఇచ్చారు. మరో కార్యకర్తకు ఇటీవల గాయాలు కావడంతో రూ. 5 వేలు అందించారు. ఈ కార్యక్రమంలో మతం వెంకటేశ్, కిషోర్, నారాయణ, ప్రభాకర్, తిరుపతి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

అంతా మా ఇష్టం!

విధులు నిర్వహించకుండానే మస్టర్?

పోస్టులు ఒక చోట... విధులు మరోచోట

సింగరేణి సెక్యూరిటీ విభాగంలో బాగోతం

భూపాలపల్లి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): సింగరేణి భూపాలపల్లి ఏరియా ఎస్ అండ్ పీసీ (సర్వీసెస్ అండ్ ప్రొటెక్షన్ కార్ప్స్)లో ప్రైవేటు సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్న కొందరు విధులు నిర్వహించకుండానే దర్జాగా మస్టర్ వేయించుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరి కొందరు వారికి డ్యూటి కేటాయించిన చోట కాకుండా అధికారుల దన్నుతో నచ్చిన చోటికి వెళ్తున్నారని తెలుస్తోంది. సింగరేణి గనులు, డిపార్టుమెంట్ల వద్ద విలువైన సామగ్రి ఉంటుంది. వాటిని దొంగలు ఎత్తుకుపోకుండా ఆ సంస్థ అధికారులు ఎప్పటికప్పుడు పటిష్ట రక్షణ కల్పించడం కోసం సెక్యూరిటీని నియమిస్తారు. కొంతమంది సెక్యూరిటీ సిబ్బంది ఇష్టారీతిన వ్యవహరిస్తూ ఆస్తుల రక్షణను గాలికి వదిలేస్తున్న పరిస్థితి నెలకొన్నాయి. ఇటీవల ఆగస్టు 15న మొదటి షిఫ్టులో సింగరేణి సెక్యూరిటీ అధికారులు 39 మందికి వివిధ పోస్టుల్లో డ్యూటీలు కేటాయించారు. వీరిలో పలువురు గార్డులు వారికి కేటాయించిన ప్రాంతాల్లో విధులకు వెళ్లకుండా అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన స్వాతంత్ర వేడుకల్లో పాల్గొన్నారని తెలుస్తోంది. నిబంధనల మేరకు తమకు కేటాయించిన పోస్టులలో వేరే వారిని అల్టర్‌నేట్‌గా విధులను అప్పగించాకే వారు అక్కడి నుంచి వెళ్లాల్సి ఉంటుందని ఎస్ఎన్‌పీసీ ఉద్యోగులు చెబుతున్నారు. అయితే... అక్కడ ఎవరినీ నియమించకుండానే గార్డులు ఇష్టారీతిగా వ్యవహరించడం పట్ల సహోద్యోగులే విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా పరేడ్‌లో పాల్గొన్న వారికి మస్టర్ ఉండదని కొంతమంది సమర్థించుకుంటున్నా వారికి మస్టర్ ఇచ్చి మరీ పరేడ్ చేయించినట్లు తెలుస్తోంది. ఇద్దరు సూపర్‌వైజర్లు ఒకే షిఫ్టులో విధులు నిర్వర్తించరాదనే నిబంధన ఉందని గార్డులు చెబుతున్నారు. కానీ ఆగస్టు 15న ఇద్దరు సూపర్‌వైజర్లకు మస్టర్ పడ్డట్లు తెలుస్తోంది. అయితే.. కొందరు సెక్యూరిటీ అధికారులను మచ్చిక చేసుకుని వారు ఇష్టమొచ్చినట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఏరియాలో తరుచూ దొంగతనాలు జరుగుతున్నాయని, ఇలాంటి గార్డులు నిర్లక్ష్యంతో సింగరేణి సంస్థకు సంబంధించిన విలువైన సొత్తు చోరీకి గురవుతోందని కార్మికులు అంటున్నారు. చర్యలు తీసుకోవాల్సిన సెక్యూరిటీ అధికారులు కంచే చేను మేసిందన్నట్టు వారికి సహకరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రైవేటు సెక్యూరిటీ గార్డుల ఉచిత మస్టర్లపై విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టాలని కోరుతున్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న భూపాలపల్లి సీఐ నరేష్‌కుమార్

కృష్ణకాలనీ (భూపాలపల్లి), ఆగస్టు 21: మత్తు పదార్థాలు, డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలని భూపాలపల్లి సీఐ నరేష్‌కుమార్ సూచించారు. బుధవారం భూపాలపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని ముందుకుసాగాలన్నారు. మత్తుకు బానిస కావడం వల్ల విలువైన జీవితాలు బుగ్గిపాలు అవుతాయన్నారు. గంజాయి సేవించినా, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉమెన్ ఎస్సై స్వప్నకుమారి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

- మహదేవపూర్: డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై మండ లంలోని కాళేశ్వరం ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాలలో ఎస్సై చక్రపాణి ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. హెచ్‌ఎం అన్నపూర్ణ, ఉపాధ్యాయులు, పోలీసులు పాల్గొన్నారు.
- టేకుమట్ల: మత్తు పద్థాల వల్ల కలిగే అనర్థాలపై మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఏఎస్సై అమరేందర్‌రెడ్డి పలు అంశాలను వివరించారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం కవిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.
- కాటారం: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో పోలీసుల ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్స్ అవేర్‌నెస్ ప్రోగ్రాం చేపట్టారు. విద్యార్థులకు డ్రగ్స్, గంజాయి తదితర మత్తుపదార్థాలతో కలిగే దుష్పరిణామాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఎస్సై అభినవ్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. గురుకుల కళాశాల అధ్యాపకులు, పోలీస్‌సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.
- మహాముత్తారం: మండలంలోని కస్తూర్బా పాఠశాలలో కాటారం సీఐ నాగార్జునరావు ఆధ్వర్యంలో మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు ఎస్సై పలు అంశాలపై జాగ్రత్తలు చెప్పారు.
- చిట్యాల: మత్తు పదార్థాల నియంత్రణపై మండల కేంద్రంలోని గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థినులకు చిట్యాల రెండో ఎస్సై షాఖాన్ అవగాహన కల్పించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు అలవాటుపడితే జరిగే అనార్థాలను వివరించి చెడు అలవాట్లకు దూరం చేయాలన్నారు. ఈ అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ గోల్కొండ భిక్షపతి, హెడ్‌కానిస్టేబుల్ మధుసూదన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- మంగపేట: మంగపేట పోలీసుల ఆధ్వర్యంలో మండల స్థాయి వాలీబాల్ టోర్నీని రెండు రోజుల పాటు పోలీస్‌స్టేషన్ ఆవరణంలో నిర్వహించారు. మండల వ్యాప్తంగా 12 వాలీబాల్ టీమ్‌లు ఈ పోటీలలో పాల్గొన్నాయి. పోలీస్ పీఈటీలు ఈ పోటీలను పర్యవేక్షించారు. విజేతలకు ఏటూరునాగారం సీఐ అనుముల శ్రీనివాస్ బహుమతులను ప్రదానం చేశారు. యువత మత్తు పదార్థాలకు బానిస కావద్దని, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని పోలీసు శాఖ కాంక్షిస్తోందని ఆయన అన్నారు. ఈ నేపథ్యంలో పోటీలను నిర్వహించామన్నారు. మంగపేట ఎస్సై టీవీఆర్. సూరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సివిల్, సీఆర్‌పీఎఫ్ పోలీసులు, పలు గ్రామాల యువకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



మంగపేటలో క్రీడాకారులకు బహుమతులను అందజేస్తున్న పోలీసు అధికారులు

సార్వత్రిక విద్య ఓ వరం : డీఈవో పాణిని

ములుగు రూరల్ ఆగస్టు 21: చదువు మానేసిన విద్యార్థులకు సార్వత్రిక విద్య ఓ వరం లాంటిదని డీఈవో పాణిని అన్నారు. ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాల పోస్టర్‌ను ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ శంకర్‌రావు, ఏసీజీఈ జయదేవ్‌తో కలిసి విద్యాశాఖ అధికారి కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వారు, మహిళలు, వివిధ వృత్తి పనులు చేసుకునే వారు తమకు ఇష్టమైన సబ్జెక్టులను ఎంపిక చేసుకుని ఈ కోర్సులను పూర్తిచేయొచ్చన్నారు. ఆసక్తి ఉన్నవారు అధ్యయన కేంద్రాల కోఆర్డినేటర్లను సంప్రదించాలని సూచించారు. ప్రవేశాలకు సెప్టెంబర్ 10 వరకు అవకాశముందన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయం కోఆర్డినేటర్లు అర్షం రాజు, కాటం మల్లారెడ్డి, సాబయ్య, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిర్చి సాగుపై రైతులకు శిక్షణ

మల్హర్, ఆగస్టు21 మిర్చి సాగుపై పెద్దతూండ్ల రైతు ఉత్పత్తిదారుల సంఘం సభ్యులకు తాడిచర్లలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖ జిల్లా అధికారి సంజీవరావు హాజరై మిర్చి సాగులో విత్తనం ఎంపిక నుంచి మడుల తయారీ, ఎర పంటల సాగు, బార్డర్ మొక్కల సాగు, మల్చింగ్, డ్రిప్ నీటి పారుదల, ఎరువుల యాజమాన్యం, సమగ్ర సస్యరక్షణ పద్ధతులు, కోత, ఆరబెట్టడం, మార్కెటింగ్ తదితర అంశాలను వివరించారు. వ్యవసాయ శాఖ జిల్లా అధికారి విజయ భాస్కర్ మాట్లాడుతూ రైతులకు అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ ఎంపీపీ చింతలపల్లి మల్హల్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ ఇప్ప మొండయ్య, రైతు ఉత్పత్తిదారుల సంఘం సభ్యులు, రైతులు ఉన్నారు.

విధులు బహిష్కరించిన జీపీ కార్మికులు

కాటారం, ఆగస్టు 21: మండలంలోని ప్రతాపగిరి, చిద్నెపల్లి గ్రామపంచాయతీలకు చెందిన కార్మికులు బుధవారం విధులు బహిష్కరించారు. తమకు ఏడెనిమిది నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఓ వారం వ్యవసాయ కూలి పనులు చేసి, మరో వారం రోజులు జీపీ విధుల్లో పాల్గొంటామని పంచాయతీ కార్యదర్శులు శంకర్, దేవేందర్‌కు వినతిపత్రం అందించారు. ఉదయాన్నే పనులు చేయడానికి విధులకు రావాలని పంచాయతీ కార్యదర్శులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని, వేతనాలు మాత్రం ఇవ్వడం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మల్లేష్, సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో వృక్ష రక్షాబంధన్

మహదేవపూర్, ఆగస్టు 21: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం వృక్షారక్షాబంధన్ కార్యక్రమం బుధవారం జరిగింది. వృక్ష శాస్త్ర అధ్యాపకురాలు రజిత ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ జన్ను విజయ్‌కుమార్ మాట్లాడుతూ వృక్షాలు ప్రాణవాయువును నిరంతరం విడుదల చేస్తాయని తెలిపారు. చెట్టను రక్షిస్తే అవి మానవాళిని రక్షిస్తాయని తెలిపారు. ఈకార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనాస్, రాజు, రవీందర్, రమేష్, రాజేందర్, మున్నయ్య, పరుశరాములు, రవీందర్, మాధురి, హనుమ, అధ్యాపకేతర సిబ్బంది శ్రీధర్, వెంకటయ్య, రవీందర్, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఫ్లోరైడ్ మందు చల్లుతుండగా అస్వస్థత

మంగపేట, ఆగస్టు 21: తన వరి చేనులో ఫ్లోరైడ్ మందును చల్లుతున్న రైతు సమన్వయ సమితి మండల మాజీ కోఆర్డినేటర్ సామా మోహన్‌రెడ్డి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. సొమ్మసిల్లి పడిపోయిన ఆయన్ను తోటి రైతులు మంగపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అక్కడి డాక్టర్లు ఏటూరునాగారం సామాజిక వైద్యశాలకు రిఫర్ చేశారు.

ఓపెన్‌కాస్ట్‌లో వనమహోత్సవం

కాకతీయఖని, ఆగస్టు 21: సింగరేణి భూపాలపల్లి ఏరియాలోని ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్ట్-2లో బుధవారం ఘనంగా వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఏరియా జనరల్ మేనేజర్ హబీబ్ హుస్సేన్ మొక్కలు నాటారు. కాలుష్యాన్ని తగ్గించాలంటే విరివిగా మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు వెంకట్రామిరెడ్డి, నజీర్, పోషమల్లు, కృష్ణయ్య, శంకర్, వినోద్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

బందాలలో సెల్‌టవర్ ప్రారంభం

తాడ్వాయి, ఆగస్టు 21: మండలంలోని మారుమూలన దట్టమైన అటవీప్రాంతంలో ఉన్న బందాల గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎయిర్‌టెల్ సెల్‌టవర్‌ను బుధవారం ఎస్పీ శబరీశ్ ప్రారంభించారు. సెల్‌టవర్ సేవలు బందాల, పోచాపూర్, అల్లిగూడెం, గొల్లపల్లి, నర్సాపూర్ గ్రామాలకు అందుతాయని అన్నారు. గతంలో ఎలాంటి నెట్‌వర్క్ లేక మారుమూల అటవీ గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, సెల్‌టవర్ ఏర్పాటుతో 4జీ సిగ్నల్స్‌లో అత్యవసర సేవలు అందుతాయని అన్నారు. మారుమూల గ్రామాల్లో సమస్యలు తలెత్తితే పోలీస్‌శాఖను ఆశ్రయించాలని ఆయన సూచించారు. నెట్‌వర్క్ టవర్లను నిర్మించడంలో కృషి చేసిన డీఎస్పీ రవీందర్, పస్రా సీఐ రవీందర్, తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆపరేషన్ మేనేజర్ సుగుణాకర్‌రెడ్డి, ప్రాజెక్టు మేనేజర్లు సదానందం, రమేష్‌బాబు, ప్రదీప్‌మోతె, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చోరీలకు పాల్పడిన వ్యక్తి అరెస్టు

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 21: పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ప్రాంతంలో తాళం వేసి ఉన్న సింగరేణి కార్మికుల ఇళ్లల్లో చోరీలకు పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు గోదావరిఖని టూటౌన్ సీఐ ప్రసాదరావు ప్రకటనలో పేర్కొన్నారు. కేసు పూర్వపరాలను ఆయన ఈ మేరకు వెల్లడించారు. భూపాలపల్లికి చెందిన దురిశెట్టి స్వామి నిరంజన్ డిగ్రీ పూర్తి చేశాడు. జల్సాలకు అలవాటు పడి దొంగతనాలు చేస్తూ పలుమార్లు జైలుకు వెళ్లాడు. అతడిపై 14 కేసులు ఉన్నాయి. భద్రాచలం సబ్ జైలులో ఉన్న సమయంలో రవీందర్ అనే తోటి ఖైదీ రవీందర్‌తో పరిచయం ఏర్పడింది. తన భార్య గర్భిణి అని, ఎలాగైనా తనను బయటకు తీసుకురావాలని నిరంజన్‌ను అతడు కోరాడు. దీంతో రవీందర్‌ను బయటకు తీసుకొచ్చేందుకు అవసరమైన డబ్బు సమకూర్చుకునేందుకు దొంగతనాలు చేయాలని స్వామినిరంజన్ నిర్ణయించుకున్నాడు. ఈనెల 9న భద్రాచలం నుంచి గోదావరిఖనికి వచ్చి మిలీనియం క్వార్టర్‌లో తాళం వేసి ఉన్న ఇంటి తాళం పగులగొట్టి రెండున్నర తులాల బంగారు ఆభరణాలు, రెండు తులాల వెండి చోరీ చేశాడు. పార్కింగ్‌లో బైక్‌ను తీసుకుని కొత్తగూడెం వెళ్లాడు. వరంగల్ శివారులో పెట్రోల్ అయిపోవడంతో బైక్‌ను అక్కడే వదిలి బస్సులో భద్రాచలం చేరుకున్నాడు. చోరీ చేసిన నగలను కొత్తగూడెంలోని ఫైనాన్స్‌లో కుదువపెట్టి, వచ్చిన డబ్బులతో లాయర్‌ను మాట్లాడి రవీందర్‌కు బెయిల్ వచ్చేలా ఏర్పాట్లు చేశాడు. చోరీ చేసిన డబ్బులు అయిపోవడం, మళ్లీ డబ్బులు అవసరం పడడంతో స్వామినిరంజన్ మళ్లీ దొంగతనం చేయాలని నిర్ణయించుకున్నాడు. ఈనెల 14న పోతనకాలనీలో సింగరేణి క్వార్టర్స్‌లో రెక్కీ నిర్వహించారు. అర్ధరాత్రి 12 గంటలకు ఒక క్వార్టర్ తాళం పగులగొట్టి రూ.5,500 నగదు, మరో క్వార్టర్‌లో ఎనిమిది తులాల వెండితో పాటు ఫాస్ట్ ట్రాక్‌వాచ్, బ్లూటూత్ హెడ్‌సెట్ చోరీ చేశాడు. పార్కింగ్ స్థలంలో ఉన్న బైక్‌ను చోరీ చేసి కొత్తగూడెం వెళ్తున్న క్రమంలో చంద్రుగొండ వద్ద బైక్ పాడవడంతో అక్కడే వదిలి పారిపోయాడు. తిరిగి చోరీ చేయడానికి బుధవారం పోతనకాలనీకి వచ్చిన స్వామినిరంజన్ పోలీసులకు పట్టుబడ్డాడు.

ఆస్పత్రికి సూపరింటెండెంట్‌ను నియమించాలి

చిట్యాల, ఆగస్టు 21: చిట్యాల సామాజిక ఆస్పత్రికి సూపరింటెండెంట్‌ను నియమించాలని సీపీఐ (ఎంఎల్)- లిబరేషన్ జిల్లా కార్యదర్శి మారపెల్లి మల్లేష్ డిమాండ్ చేశారు. స్థానిక సివిల్ ఆస్పత్రిని ఆయన బుధవారం సందర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఆస్పత్రిలో సూపరింటెండెంట్‌తో పాటు వైద్యుల కొరత మూలంగా రోగులకు సరైన వైద్య సేవలు అందడంలేదని తెలిపారు. ప్రస్తుతం ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీకాంత్ డిప్యుటేషన్‌పై జిల్లా ఆస్పత్రికి వెళ్తుండడంతో ఆస్పత్రిలో పర్యవేక్షణ లోపిస్తుందన్నారు ఆయన వెంట సాయికుమార్, అశోక్, సమ్మయ్య తదితరులు ఉన్నారు.

గోదావరిలో భక్తుల పుణ్య స్నానాలు

మహదేవపూర్, ఆగస్టు 21 : కాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయా నికి బుధవారం భక్తులు పోటెత్తారు. బుధవారం గోదావరిలో పుణ్యస్నా నాలు ఆచరించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణ బుధవారాన్ని పురస్కరిం చుకుని భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.



గోదావరిలో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

'మధ్యాహ్న భోజనం' కార్మికుల ధర్నా

ములుగు, ఆగస్టు 21: సెంట్రలైజ్డ్ కిచెన్ విధానం పేరుతో హరేరామ, హరేకృష్ణ ఫౌండేషన్ ద్వారా వంటలు చేయడానికి ప్రయత్నించడం విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన వంట కార్మికులు బుధవారం ములుగులోని జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈకార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జంపాల రవీందర్ మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వంట కార్మికులకు నెలకు రూ.10వేల వేతనం అందించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, వంట బిల్లులు, కోడిగుడ్ల బిల్లులు, అల్పాహారం బిల్లులు అందించాలని డిమాండ్ చేశారు. ఇవేమీ పట్టించుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం హరేరామ, హరేకృష్ణ ఫౌండేషన్ ద్వారా పాఠశాలల విద్యార్థులకు భోజనం అందించాలని చూడడం సరైందికాదని అన్నారు. దీంతో వంటకార్మికులు రోడ్డునపడే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. ఈకార్యక్రమంలో వంట కార్మికులు సామల రమ, గున్నాల రాజకుమారి, పోరెడ్డి ప్రమీల, ఉమ, పర్వీన, సమ్మక్క, శోభ, సరోజన, పోశమ్మ, లక్ష్మి, కమల, రాధ, స్వరూప, ఏఐటీయూసీ నాయకులు ముత్యాల రాజు, భవాని, నిర్మల, లక్ష్మి, మణెమ్మ, నీలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు చేయూతనివ్వాలి

ములుగు కలెక్టర్ దివాకర

ములుగు, ఆగస్టు 21: దివ్యాంగులకు ప్రతి ఒక్కరూ చేయూతనివ్వాలని కలెక్టర్ దివాకర అన్నారు ములుగులోని గిరిజన భవన్‌లో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆలింకో సహకారంతో ఏర్పాటు చేసిన దివ్యాంగుల సహాయ ఉపకరణాల గుర్తింపు శిబిరాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. ములుగు, వెంకటాపూర్, గోవిందరావుపేట ప్రాంతాలకు చెందిన దివ్యాంగులకు సహాయ ఉపకరణాలు అందించేందుకు శిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. దివ్యాంగులు దూర ప్రాంతాల నుంచి రావడం వారికి ఇబ్బంది అవుతుందని, వారి సౌకర్యార్థమై రాష్ట్రంలో ఎక్కడా జరగని విధంగా జిల్లాలో ప్రత్యేకంగా ములుగు, పస్రా, ఏటూరునాగారంలో మూడు క్యాంపులను ఏర్పాటు చేశామని తెలిపారు. 40శాతం నుంచి 80శాతం వరకు దివ్యాంగత్వం ఉన్నవారికి రకరకాల సహాయ ఉపకరణాలు అందిస్తున్నావన్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి స్వర్ణలత లెనిన, ఆలింకో సంస్థ ప్రతినిధి ఆశిష్, జిల్లా గ్రామీణా భివృద్ధి అధికారి సంపత్‌రావు, బీసీ సంక్షేమ అధికారి రవీందర్‌రెడ్డి, ప్రియనేస్తం ఫౌండేషన్ ప్రతినిధి పి.నాగ రాజు, జిల్లా బాలలపరిరక్షణ అధికారి జె.ఓంకార్, సీడీపీవో శిరీష, సూపర్‌వైజర్లు, బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్‌హెల్ప్‌లైన్ , జిల్లా సంక్షేమాధికారి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌హెచ్ భూసేకరణలో

వేగం పెంచాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్‌అండ్‌బీ ప్రిన్సిపల్ సెక్రటరీ

భూపాలపల్లి కలెక్టరేట్, ఆగస్టు 21: నేషనల్ హైవే భూసేకరణలో వేగం పెంచాలని ఆర్‌అండ్‌బీ ప్రిన్సిపల్ సెక్రటరీ దాసరి హరిచందన అధికారులను ఆదేశించారు. సెక్రటేరియట్ నుంచి ఆమె బుధవారం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణ పనులను సంబంధిత అధికారులతో కలిసి సమీక్షించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రైతులతో మాట్లాడి వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. కలెక్టర్ రాహుల్‌శర్మ మాట్లాడుతూ గ్రీన్ ఫీల్డ్ నేషనల్‌హైవేకు జిల్లాలో 130.5 హెక్టార్ల విస్తీర్ణం అవసరం ఉందన్నారు. భూసేకరణకు సంబంధించి రైతులతో ఇప్పటికే సమావేశం నిర్వహించామన్నారు. రెండు రెట్ల ధరలు చెల్లిస్తామన్నా రైతులు ఒప్పుకోవడంలేదన్నారు. మరోకసారి రైతులతో మాట్లాడి భూసేకరణ పనులను పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీవో మంగిలాల్, డీఎఫ్‌వో లావణ్య తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణపై మాల మహానాడు నిరసన

మంగపేట, ఆగస్టు 21: వర్గీకరణకు వ్యతిరేకంగా మాలమహానాడు నిరసన తెలిపారు. మండలంలోని వ్యాపార, వాణిజ్య సంస్థలను బంద్ చేయించారు. అనంతరం రాజుపేట బస్టాండ్ వద్ద బూర్గంపహాడ్- ఏటూరునాగారం ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎస్సీల వర్గీకరణ ప్రతిపాదనను రద్దుచేసి దళితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు ములుగు జిల్లా అధ్యక్షుడు కర్రి శ్యాంబాబు, నాయకులు పల్లికొండ యాదగిరి, గంగెర్ల రాజరత్నం తదితరులు పాల్గొన్నారు.

వెంకటాపురంలో..

వెంకటాపురం(నూగూరు) : ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలమహానాడు ఆధ్వర్యంలో నాయకులు బుధవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తంచేశారు. అంతకుముందు వారు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా మాలమహానాడు మండల అధ్యక్షుడు సాధనపల్లి చిట్టిబాబు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల ఎంపీలతో చర్చించి నిర్ణయం తీసుకోకుండా అందుకు విరుద్ధంగా చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంఖ్యా ఆదినారాయణ, లక్కుమల్ల మోహన్, మోత్కూరి రాజు, రవి, గుండమల్ల రమేష్, రమణయ్య, సాధన పల్లి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఫొటో తీసినందుకు పోలీసులకు ఫిర్యాదు

మంగపేట, ఆగస్టు 21: విధుల్లో ఉన్న తన ఫొటో తీసినందుకు ఓ యువకుడిపై మహిళా వైద్యాధికారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈ ఘటన బుధవారం చోటుచేసుకుంది. పీహెచ్‌సీలో మహిళా వైద్యాధికారి రోగులతో మాట్లాడు తుండగా చింతకింది ముకుందం అనే యువకుడు తన మొబైల్‌లో ఫొటో తీశాడు. ఇది గమనించి వైద్యాధికారి అతడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం పోలీసులకు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకొని అతడిని అదుపులోకి తీసుకున్నారు. పీహెచ్‌సీలో వైద్యులు సమయపాలన పాటించడం లేదని, విధులకు లేట్‌గా వస్తున్నారని, ఈ అంశాన్ని తన మొబైల్‌లో చిత్రీకరిస్తుండగా వైద్యాధికారి తనపై పోలీసులకు ఫిర్యాదు చేశారని అన్నారు. వాస్తవాన్ని వెలుగులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ఫొటో తీశానని, దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయడం అన్యాయమని పేర్కొన్నాడు.

పోచమ్మ బోనాల సందడి

వెంకటాపూర్(రామప్ప), ఆగస్టు 21: మండల కేంద్రంలో పోచమ్మ బోనాల వేడుకలు ఘనంగా జరిగింది. శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. శ్రావణమాసం మరో 15రోజుల సమయం ఉండడంతో బుధవారం గంగమ్మ, మైసమ్మ, పోచమ్మ, ఎల్లమ్మ, పెద్దమ్మ బోనాలతో సందడి చేశారు.

- ఏటూరునాగారం: మండల కేంద్రంలోని పోచమ్మ గుడి వద్ద మహిళలు బోనాలు సమర్పించుకున్నారు. మేళతాళాలతో తరలివెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి ధూపనైవేద్యాలతో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అంతటి విజయ, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.
- మొగుళ్లపల్లి: మండలంలోని ఇస్సిపేటలో విశ్వబ్రాహ్మణులు, కాపు కులస్థుల ఆధ్వర్యంలో పోచమ్మతల్లి బోనాల పండుగ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారికి నైవేద్యం, పసుపు, కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కోళ్లు, గొర్రెలను బలిచ్చారు.